క్లుప్తంగా

వినాయక చవితికి పందిరి రాట



విశాలాక్షినగర్‌లో పందిరి రాట వేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించనున్నారు. శుక్రవారం యూత్ సభ్యులు బీవీకే కాలేజీ సమీపంలో చవితి రాట వేశారు. కార్యక్రమంలో విశాలాక్షినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, అసోసియేషన్ సభ్యులు బీమారావు, సాయినితిన్, శ్రీహరి, శివప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏయూ ఉద్యోగుల క్రికెట్ పోటీలు



సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న సీఏవో జట్టు

మద్దిలపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులకు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు నాలుగు జట్ల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. సీఏవో-1 జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆ టీం ప్లేయర్ గోవింద అత్యధికంగా 44 పరుగులు సాధించారు. శనివారం జరిగే పోటీల్లో 6 జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు వెంకటాద్రి, సిద్ధయ్య హాజరు కానున్నారు. పోటీల నిర్వాహకులుగా దువ్వి గోవింద, డి.శ్రీనివాసరావు, కోనా పోలారావు, కర్రి శ్రీనివాస్ వ్యవహరించారు. ఖాదర్ బాబా, ఈశ్వరరావులు ఆసక్తికరమైన వ్యాఖ్యానంతో మ్యాచ్‌లను రక్తికట్టించారు.

హమ్మయ్య.. బోరు బాగుచేశారు



బోరు బాగు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు వెర్నిదుర్గానగర్‌లో మూలకు చేరిన చేతి బోరును నీటి సరఫరా విభాగం అధికారులు బాగు చేయించారు. ఇక్కడ బోరు పాడై, నీటి ఇబ్బందులు తలెత్తడంతో స్థానికులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు శుక్రవారం సిబ్బందితో మరమ్మతులు చేయించారు. బోరు బాగై, నీరు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నీటి సరఫరా విభాగం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పూటుగా మద్యం తాగి వ్యక్తి మృతి

ఎంవీపీకాలనీ: అధికంగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మద్దిలపాలెంలో జరిగింది. ఎంవీపీ పీఎస్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోపాలకృష్ణ(55) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి మద్దిలపాలెంలో నివసిస్తున్నాడు. తన దగ్గరి బంధువుల ఇంట్లో ఫంక్షన్ కావడంతో శుక్రవారం ఉదయం నుంచి పూటుగా మద్యం తాగాడు. మధ్యాహ్నం అదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై మరణించి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిగా భావించి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కేజీహెచ్‌కు వెళ్లి పోలీసులను సంప్రదించగా.. మృతదేహాన్ని వారికి అప్పగించారు.

అప్పన్నకు నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు.

అంత్యక్రియలకు అవస్థలు

- పాత వెంకోజిపాలెం శ్మశానవాటికలో సదుపాయాలు శూన్యం
- మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నానా తంటాలు
- సరైన రహదారి సౌకర్యం లేదు
- తుప్పలతో నిండి.. అధ్వానంగా పరిసరాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



చెత్తాచెదారంతో నిండిన కాలువ



పిచ్చిమొక్కలు, తుప్పల మధ్యలో పాత వెంకోజిపాలెం శ్మశానవాటిక

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజిపాలెం శ్మశానవాటికలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఇక్కడ అంత్యక్రియలు జరిపేందుకు మృతుల కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిలో సౌకర్యాల కల్పన గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అపరిశుభ్ర పరిసరాలు, నిండా దట్టంగా పెరిగిన తుప్పలు, పిచ్చి మొక్కలతో శ్మశానవాటిక నిండిపోయింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు సరైన మార్గం కూడా లేని దుస్థితి నెలకొంది. దశాబ్ద కాలం నుంచి ఉన్న ఈ శ్మశానవాటికలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో అధ్వానంగా తయారైంది.

అభివృద్ధికి దూరంగా..

పాత వెంకోజిపాలెంలో అత్యధికంగా నివసిస్తున్న గవర, రెడ్డి, ఎస్సీ కులస్తులు ఈ శ్మశానవాటికనే దహన సంస్కారాలకు వినియోగిస్తుంటారు. కొత్త, పాత వెంకోజిపాలేలకు చెందిన గ్రామ సేవా సంఘం, శ్రీ సీతా రామ సేవా సంఘం వారు వినియోగించే ఈ శ్మశానవాటికను అభివృద్ధి చేయడానికి అనేక మంది నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పలుసార్లు విఫలయత్నం చేశారు. శ్మశానవాటికకు రోడ్డు మార్గం, అసంపూర్తంగా ఉన్న కాలువ నిర్మాణం కూడా చేపట్టలేకపోయారు.

తుప్పలు దాటుకుంటూ వెళ్లాల్సిందే..

2014లో టీడీపీ ప్రభుత్వంలో ఈ శ్మశానవాటికను ఆనుకుని కొంత మేరకు మాత్రమే కాలువ నిర్మించగలిగారు. తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేసింది. ఇక్కడున్న సాధు మఠం వారు అభ్యంతరం లేవనెత్తడంతో తమ వంతు ప్రయత్నాన్ని వదిలేశారు. మెయిన్ రోడ్డుపై నుంచి శ్మశానవాటికకు కనీసం 300 మీటర్లు లోపలికి వెళ్లాలి. ఈ మార్గమంతా తుప్పలతో నిండిపోయి ఉంది. వాటిని దాటుకుంటూ మృతదేహాన్ని తీసుకెళ్లాల్సి వస్తోంది. శ్రమదానంతో ఎవరైనా తుప్పలు తొలగించి కాస్తంతా శుభ్రం చేస్తే ఇటువైపు వెళ్లే వారు బహిర్భూమిగా వాడుకుంటున్నారు. ఇది చాలదన్నట్టు.. ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో రాత్రీ పగలు అనే తేడా లేకుండా గంజాయి బ్యాచ్‌లు వీర విహారం చేస్తుంటాయి. తమ ప్రాంత శ్మశానవాటిక అభివృద్ధి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని గ్రామ సేవా సంఘాల సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

ఆత్మీయానురాగాల రక్షా బంధన్



గొల్ల కంచరపాలెంలో రాఖీలు తయారు చేస్తున్న బాలికలు



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో రాఖీల స్టాల్

కంచరపాలెం: రక్షా బంధన్ వేడుకను పురస్కరించుకుని గొల్ల కంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు రాఖీల తయారీలో శిక్షణ ఇచ్చారు. సహజ సిద్ధంగా దొరికే సామగ్రితో రాఖీలు తయారు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆత్మీయానురాగాలకు చిహ్నమైన రాఖీ పండగ విశిష్టతను తెలిపేందుకు శిక్షణ ఇస్తున్నట్లు ట్రస్టు సభ్యులు నమ్మి జ్యోతిబాబు చెప్పారు. కార్యక్రమంలో మహాలక్ష్మి, మాన్విత, జశ్వంత్, ఎస్.తేజ, పి.లావణ్యలక్ష్మి, సాద్విక్, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు

సీతంపేట: రాఖీ పండగకు అక్కచెల్లెమ్మలు సిద్ధమయ్యారు. శనివారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మార్కెట్‌లో శుక్రవారం రాఖీల విక్రయాలు జోరుగా సాగాయి. అక్కయ్యపాలెం, సీతంపేట, శంకరమఠం రోడ్డు, సీతమ్మధార, రామాటాకీస్, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసి ఆకర్షణీయమైన మోడళ్లలో రాఖీలు విక్రయిస్తున్నారు. అన్నదమ్ముల ఆశీర్వచనాలు అందుకునేందుకు చిన్నారులు, యువతులు, మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కొనుగోలు చేశారు. రాఖీ దుకాణాలతోపాటు స్వీట్ షాపులు కళకళలాడాయి. మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

తుంగభద్ర వారియర్స్ జెర్సీ ఆవిష్కరణ



కొత్త జెర్సీతో తుంగభద్ర వారియర్స్

డాబాగార్డెన్స్: ఏపీఎల్ సీజన్-4లో ఆడనున్న 'తుంగభద్ర వారియర్స్' క్రికెట్ టీం జెర్సీని శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగభద్ర వారియర్స్ ప్రతినిధి శేషుకుమార్ మాట్లాడుతూ తుంగభద్ర టీం అనేది ఏపీఎల్‌లో ఆడే ఓ జట్టని, శేషుకుమార్, సిద్ధార్థ మురకొండ లీడ్ చేస్తున్నారని, స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ టీం ఆడుతుందన్నారు. ఈ నెల 23 వరకు 7 టీమ్‌లతో ఆడనుందని చెప్పారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, ఉదయం 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

పంచామృతాభిషేకం రేపు

శుద్ధ పౌర్ణమి హయగ్రీవ జయంతి సందర్భంగా ఆదివారం వైభవ వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి నిజ రూప దర్శనం ఉంటుంది. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన చేస్తారు. మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు.

ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు ముఖం చాటు!

- స్టాండ్‌లోకి రాని ఆటోలు
- రోడ్డుపైనే వెయిటింగ్
- అధిక భారంతో ప్రయాణికుల విలవిల



ఖాళీగా దర్శనమిస్తున్న ప్రీపెయిడ్ ఆటోస్టాండ్

అగనంపూడి: ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు ముగింపు పలికేందుకు ఆటో డ్రైవర్లు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పది రోజుల కిందటే ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రయాణికుల భద్రతతో పాటు ధరలు అందుబాటులో ఉంచేందుకు ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. అప్పట్లో 70 మంది ఆటోవాలాలు ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌లో నమోదు చేసుకున్నారు. కిలోమీటర్లను అనుసరించి ధరలు నిర్ణయించారు. ఆ మేరకు ఆటోలు నడిపితే డ్రైవర్లు ఆశించిన డబ్బులు రావని భావించిన ఆటోవాలాలు స్టాండ్‌లో కాకుండా ఆరుబైట ఆటోలు నిలిపేస్తున్నారు. అధికారిక ఆటో స్టాండ్‌లోఆటోలు నిలపడం మానేశారు. నేరుగా స్టేషన్ ఆవరణకు వెళ్లిపోయి ప్రయాణికులతో మాట్లాడుకొని వారు నిర్ణయించిన రేటు ప్రకారం ప్రయాణికులను తీసుకువెళ్తున్నారు. దీంతో ప్రయాణికులకు మేలు చేయాలని భావించి తాము చేసిన పోరాటం మూణ్నాళ్ల ముచ్చటగా మారే పరిస్థితి ఉందని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్దకు వెళ్లి ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్ ఉందని, అక్కడికి వెళ్తే తక్కువ ధరకు భద్రంగా గమ్యస్థానాలకు వెళ్లవచ్చని యూనియన్ నాయకులు చెబుతున్నారు. దీంతో ప్రయాణికులు తీరా అక్కడికి వెళ్లాక ఆటోలు అందుబాటులో లేకపోవడంతో పోలీస్ కంట్రోల్ సిబ్బంది కూడా చేసేది లేక చేతులు ఎత్తేస్తున్నారు.

ధరలు ఇలా

పోలీసులు నిర్ణయించిన ధర ప్రకారం ఉక్కు నగరానికి రూ.90 చెల్లించాలి. కానీ ఆటో డ్రైవర్లు ఇప్పటి వరకు రూ.200 నుంచి రూ.250 వరకు వసూలు చేస్తున్నారు. అదే రాత్రి తొమ్మిది దాటితే డ్రైవర్లు అడిగినంత చెల్లించుకోవాల్సిందే. ఆ రేట్లకు అలవాటు పడిన డ్రైవర్లు ససేమేరా అంటుండడంతో ప్రయాణికులకు భారం తప్పడం లేదు.

రైల్వేస్టేషన్ ముఖద్వారం మార్చాలి

స్టేషన్ బయటకు వెళ్లి బస్టాప్ వద్దకు వెళ్తే తప్పా ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ కనపడడం లేదు. స్థానికంగా ఉన్న ప్రయాణికులకు తప్పా ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ విషయం తెలియని పరిస్థితి. ఈ క్రమంలో స్టాండ్‌ను ఔట్ గేటుకు ఆనుకొని పెడితే తప్పా ప్రయాణికులకు న్యాయం జరిగే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఆటోలను ఔట్ గేటు బయటే నిలిపేలా చేయాలని ప్రయాణికులు, రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే, పోలీస్ కమిషనర్లను కోరుతున్నారు. ఆటో స్టాండ్ ఉన్నట్టు ప్లాట్ ఫారాల, ఇన్‌గేటు, బుకింగ్ కౌంటర్ వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పథకాలు ఇవ్వరు.. హామీలు నెరవేర్చరు



20వ వార్డులో స్థానికులకు కూటమి మోసాలను వివరిస్తున్న మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను నిలిపేయడమే కాకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం వేధిస్తోందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 20వ వార్డు చినవాల్తేరులోని రజక వీధి 168 బూత్‌లో కార్పొరేటర్ ముమ్మల లక్ష్మీ ఆధ్వర్యంలో, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్మల సురేష్ అధ్యక్షతన శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ 140 పైగా అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. 15 నెలలైనా ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చక పోవడం చంద్రబాబు మోసపూరిత పాలనకు నిదర్శనమన్నారు. ప్రజలందరూ చంద్రబాబు మోసాలను దృష్టిలో పెట్టుకుని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో సహా పెకలించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రవికిరణ్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, వార్డు యూత్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీను, పాలకొల్లు శంకర్, దిల్ రాజ్, రాము, కాగితాల రామిరెడ్డి, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితకు ఆశ్రయం



జ్యోతిశ్రీని షెల్టర్ నిర్వాహకుడు వాసుకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ గాయత్రి

అల్లిపురం: కాకినాడకు చెందిన వివాహిత వానపల్లి జ్యోతిశ్రీ భర్త హింస భరించలేక ఇల్లు వదిలి విశాఖ చేరుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త రోజూ కొడుతుండటంతో ఇల్లు వదిలి పుట్టింటికి వెళ్లింది. జ్యోతిశ్రీ తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి అత్తవారి ఇంటికి పంపించారు. అత్తగారే చాడీలు చెబుతూ, కొడుకుతో కలిసి చిత్రహింసలు పెడుతుండటంతో ఆమె తట్టుకోలేక ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. ఒంటరిగా మహారాణిపేట రోడ్ల మీద తిరుగుతూ ఉండగా.. లేడీ కానిస్టేబుల్ గాయత్రి ఆమెను చూసి వివరాలు తెలుసుకుంది. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్‌కు జ్యోతిశ్రీని తీసుకెళ్లింది. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో జీవీఎంసీ మహిళల వసతి గృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

డాక్‌యార్డ్ కేటీబీ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విశాఖ విద్య: డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గంట్ల శ్రీనుబాబు, అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల చిరంజీవి, విజనగిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరోతి వెంకటేష్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా యాతము రాజ్ కుమార్, కోశాధికారిగా గనిరెడ్డి శ్రీనివాస్‌తో కలిపి మొత్తం 27 మంది నూతన కార్యవర్గంలో ఎన్నికయ్యారు. సంఘ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్‌లోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం తొలిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శ్రీనుబాబు,అధ్యక్షుడు బత్తుల చిరంజీవి మాట్లాడుతూ రక్షణ రంగంలో సేవ చేసే అవకాశం లభించడం ప్రతి ఒక్కరూ పూర్వ జన్మసుకృతంగా భావించాలన్నారు. అందరి సహకారంతో కేటీబీ కళాక్షేత్రాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చుకోగలిగామన్నారు. అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి (సభ్యుల) తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. మూడేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. పలువురి సీనియర్లను సలహాదారులుగా, కొందరు న్యాయవాదులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులంతా అభినందనలు తెలియజేశారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ఆలయాల్లో విశేష పూజలు



కొత్త వెంకోజిపాలెం రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు.



హెచ్‌బీ కాలనీ గాయత్రీ దేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు

మద్దిలపాలెం: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్త వెంకోజిపాలెం శ్రీరామానంద ఆశ్రమం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో కొలువైన రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించిన మహిళలు సాయంత్రం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు ప్రకాశ్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కర్‌శర్మ మహిళల గోత్ర నామాలతో అర్చనలు చేసి, వారిచే కుంకుమాభిషేకం చేయించారు.

- హెచ్‌బీ కాలనీలోని బహుముఖ గాయత్రి ఆలయంలో మహిళలు లలితా సహస్రనామాలు పఠించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంత్రాలు జపించారు. అర్చకుడు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో మహిళలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.
- 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సంజయ్‌గాంధీ కాలనీ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించారు. సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు వెంకటరావుశర్మ అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ నిర్వాహకులు సిరిశెట్టి నారాయణరావు, మురళి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూజలు జరిగాయి. వేంకటేశ్వర, ప్రసన్నాంజనేయ స్వామిలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల రద్దీకి తగ్గట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.



సంజయ్‌గాంధీ కాలనీలో పూజలందుకున్న దుర్గాదేవి



ఎంవీపీ సెక్టార్-6 ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

కరెన్సీ నోట్ల అలంకరణలో నూకాంబిక



కరెన్సీ నోట్లతో అలంకరించిన అమ్మవారు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీఫారం దరి వెటర్నరీ కాలనీలోని రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇక్కడ అమ్మవారిని కరెన్సీ నోట్లు, మట్టి గాజులతో అలంకరించారు. వెటర్నరీ కాలనీ, ఇందిరానగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.